# ఈ తీర్పుతోనూ సమస్యలున్నాయి


కె. బాలగోపాల్

...ఆ ప్రశ్నలు న్యాయస్థానాలను అడగకూడదా? తమ దగ్గర ఏం సమాచారం ఉందని న్యాయ మూర్తులు ఈ వ్యాఖ్యలు చేస్తు న్నారు? ఏ సమాచారం ఆధారంగా ప్రతీ ఒబిసి కులంలోనూ ఒక ఉన్నత వర్గమే రిజర్వేషన్లు తీసుకుంటున్న దన్న నిర్ణయానికొచ్చి వారిని తొల గించాలని పట్టుబడుతున్నారు?

ఒబిసి రిజర్వేషన్ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించిన సమయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరిజిత్ పసాయత్ వ్యక్తం చేసిన వ్యతిరేక అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తుదితీర్పు సంతోషం కలిగించడం సహజం. అందువల్ల వెంటనే అందరూ దానిని ఆహ్వానించారు. కాంగ్రెస్ వారు భుజాలు చరుచుకున్నారు కూడ. అగ్రహారాలుగా ఉన్న ఉన్నత విద్యాసంస్థలలో ఒబిసిల ప్రవేశానికి మార్గం సుగమం చేసిన మేరకు ఈ తీర్పు హర్షణీయమేగానీ, ఇప్పటికి పత్రికలలో వచ్చిన వ్యాఖ్యలను బట్టే చూసినా పదిహేనేళ్లుగా రిజర్వేషన్ల విషయంలో న్యాయస్థానాలు వ్యక్తం చేస్తున్న వ్యతిరేక వైఖరినే ఈ తీర్పు ఇంకొంచెం ముందుకు తీసుకుపోయిందన్న సందేహం రాక మానదు. ఒబిసిల కిచ్చే రిజర్వేషన్ నుండి ఆయా కులాలలోని ఉన్నత వర్గాన్ని (క్రీమీలేయర్) మినహాయించాలన్న సూత్రీకరణ ఇప్పటిదాకా ఉద్యోగ రిజర్వేషన్లకే పరిమితం అయి ఉండింది. దానినిప్పుడు విద్యా వ్యవస్థలో సీట్లకూ వర్తింపచేశారు. ఆ ఉన్నత వర్గాన్ని గుర్తించడానికి ఉపయోగించవలసిన ప్రమాణాలను కూడ తామే శాసనకర్తలయినట్టు ప్రకటించారు. ఇంకా ఏమేం చెప్పారో తీర్పు పూర్తి ప్రతిని చూస్తే తప్ప చెప్పలేం.

రాజ్యాంగం రాక పూర్వం నుండి కూడ మన దేశంలో రిజర్వేషన్లు అమలయ్యాయి. దక్షిణ భారత రాష్ట్రాలలోనూ మహారాష్ట్రలోనూ వచ్చిన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాల ప్రభావం వల్ల విద్యా ఉద్యోగరంగాలలోనూ ప్రాతినిధ్య వ్యవస్థలలోనూ బ్రాహ్మణేతర కులాల ప్రవేశానికి మార్గం ఏర్పడింది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత ఇది నిజానికి మరింత సరళతరం అయిఉండాలి. రాజ్యాంగకర్తల ఉద్దేశ్యం అదే. అయితే న్యాయస్థానాలు తమ వ్యతిరేక వైఖరితో ఆ అవకాశాన్ని కుదించి వేశాయి. 1976 దాకా రిజర్వేషన్లు సమాన అవకాశాలకు విరుద్ధం అంటూ జడ్జీలు సూత్రీకరించారు. 1976లో మొట్టమొదటిసారి రిజర్వేషన్లు సమాన అవకాశాలకు విరుద్ధం కాదనీ సమాన అవకాశాలకు సాధనం అనీ సుప్రీంకోర్టు గుర్తించింది. మామూలు మనుషులకిది సులభంగానే అర్థం అవుతుంది గానీ న్యాయమూర్తులకు అర్థం కావడానికి పాతికేళ్లు పట్టింది.

అప్పటి నుండి రిజర్వేషన్ల విషయంలో కొంత అనుకూల వైఖరి కోర్టు తీర్పులలో కనిపిస్తుంది. 1992లో తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ప్రకటించిన 'మండల్ కమిషన్' కేసు ఈ అనుకూల వైఖరిని ఒక వైపు క్రోడీకరించి ఆమోదముద్ర వేస్తూ, ఆ తరువాతి వ్యతిరేక పరిణామాలకు బీజం అయిన రెండు సూత్రీకరణలను కూడ చేసింది. అన్ని ఒబిసి కులాలలోనూ 'క్రీమీలేయర్' అని పిలవబడే ఉన్నత వర్గాన్ని రిజర్వేషన్ల పరిధి నుండి తొలిగించాలన్నది ఒక సూత్రీకరణ. ఒబిసి కులాలను గుర్తించడానికి బిసి కమిషన్‌ను నియమించి బహిరంగ విచారణను చేపట్టాలన్నది రెండవది.



అప్పటినుండి గడిచిన పదిహేను సంవత్సరాలుగా మళ్లీ వ్యతిరేక వైఖరి గల తీర్పులే వస్తున్నాయి. ఈ వ్యతిరేక వైఖరిని సమర్థించుకోవడానికి రిజర్వేషన్ల వల్ల ఆయా కులాలలోని ధనవంతులే బాగు పడుతున్నారని వ్యాఖ్యానించడం వింటున్నాం. ఈ వ్యాఖ్య న్యాయమూర్తుల నుండి వింటున్నాం, సామాజిక వ్యాఖ్యాతల నుండి కూడ వింటున్నాం. నాకు తెలిసి ఈ విషయంలో ఎవరూ అధ్యయనం చేపట్టలేదు. రిజర్వేషన్లు ఆయా కులాలలో ఎంత మందికి అందాయన్న సమగ్రమైన పరిశోధన ఏదీ లేదు. న్యాయస్థానాల తీర్పులు అటువంటి ఏ పరిశోధననూ ఉటంకించలేదు. మరి ఏ సమాచారం లేకుండా ఈ నిర్ణయానికి ఎట్లావచ్చారు? ప్రభుత్వం ఏదైనా నిర్ణయం చేస్తే 'నీదగ్గర ఏం సమాచారం ఉంది? ఎప్పుడు సేకరించారు? ఎంత శాస్త్రీయంగా సేకరించావు?' అని న్యాయస్థానాలు ప్రశ్నిస్తుంటాయి. ఆ ప్రశ్నలు న్యాయస్థానాలను అడగకూడదా? తమ దగ్గర ఏం సమాచారం ఉందని న్యాయమూర్తులు ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు? ఏ సమాచారం ఆధారంగా ప్రతీ ఒబిసి కులంలోనూ ఒక ఉన్నత వర్గమే రిజర్వేషన్లు తీసుకుంటున్నదన్న నిర్ణయానికొచ్చి వారిని తొలగించాలని పట్టుబడుతున్నారు? ఒబిసిలలో ఎస్సీ, ఎస్టీలకు దగ్గరిగా ఉన్న కులాలూ ఉన్నాయి. మన దగ్గర దొమ్మరి కులాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు. దొమ్మరులలోనూ క్రీమీలేయర్‌ను తొలగించవలసిందేనా? నాకు తెలిసి ఆ కులంలో ఒక ఎమ్మెల్యే గానీ ఒక ఐఎఎస్ అధికారి గానీ ఒక జడ్జీ గానీ లేరు. రేపెవరైనా కష్టపడి ఆ హోదాను చేరుకుంటే వారి పిల్లలను వెంటనే రిజర్వేషన్లకు అనర్హులు చేయవలసిందేనా? చాలా ఒబిసి కులాలలో 'క్రీమీలేయర్'ను తొలగించినట్టయితే రిజర్వేషన్ కోటా సహితం నిండక పోవచ్చు. ప్రస్తుత విషయానికే వస్తే, ఐఐటి, ఐఐఎం వంటి సంస్థలలో సీట్లు అందుకోవాలంటే కొంత ఆర్థిక స్తోమత, విద్య విషయంలో అనుకూలమైన కుటుంబ వాతావరణం అవసరం. 'క్రీమీలేయర్' ను తొలిగించి వేస్తే 27 శాతంలో సగం కూడా నిండకపోవచ్చు. ఉద్యోగాలయితే ఖాళీగా ఉంచి మరుసటి సంవత్సరం మళ్లీ ప్రయత్నించవచ్చును గానీ విద్యాసంస్థలలో సీట్లను ఖాళీ ఉంచడానికి వీలులేదు. ఓపెన్ కాంపిటిషన్‌కు బదలాయించవలసిందే.ఇంతా చేసి ఉన్నత విద్యా సంస్థలలో ఈ తీర్పు చలవ వల్ల ఏ మార్పయినా చూడబోతామా?

రిజర్వేషన్ల లక్ష్యం సామాజిక వర్గాల మధ్య సమానత సాధించడమే తప్ప సామాజిక వర్గాల లోపల సమానత సాధించడం కాదు. దానికి కావలసిన చర్యలు వేరే. ఓపెన్ కాంపిటిషన్‌లోనూ ఇప్పటికే బాగుపడిన వారి పిల్లలే మళ్లీమళ్లీ ఎంపిక అవుతుంటారు. అదెందుకు ఎవరికీ ఆందోళన కలిగించదు? సామాజిక వర్గాలను, ప్రత్యేకించి కులాలను, నిచ్చెన మెట్ల మీద నిలబెట్టి హెచ్చు తగ్గులు నిర్దేశించిన సామాజిక వ్యవస్థను సంస్కరించి అన్ని కులాలనూ ఒకే సరసన నిలబెట్టడం రిజర్వేషన్ల లక్ష్యం. ఒబిసిలలో ఏదైనా ఒక కులం రిజర్వేషన్ల అవసరం లేకుండ ఓపెన్ కాంపిటిషన్‌లోనే అవకాశాలు పొందగలుగుతున్నదన్న అభిప్రాయం ఉన్నట్టయితే, అదెంత వరకు వాస్తవమో పరిశీలించి ఆ మేరకు ఆ కులానికిచ్చే రిజర్వేషన్ కోటా తగ్గించవచ్చు. అది న్యాయమైన చర్యే అవుతుంది. అయితే ఆ పని చేయాలంటే ముందు కులాలవారీ జనాభా లెక్కలు కావాలి, కులాల వారీగా ఓపెన్ కాంపిటిషన్‌లో ఏమేరకు నెగ్గుకొని రాగలుగుతున్నారన్న లెక్కలు కావాలి. ప్రస్తుతం ఇవేవీ లేవు.

ఇక వెనుకబడిన సామాజిక వర్గాల గుర్తింపు విషయానికొస్తే, ఒక వర్గం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉందని సూచించే ప్రాథమిక సమాచారం ప్రభుత్వం దగ్గరుంటే చాలు. ప్రభుత్వం వారికి రిజర్వేషన్ కల్పించవచ్చు. అంతే తప్ప వెనుకబాటుతనాన్ని శాస్త్రీయంగా రుజువు చేయాలన్నది రాజ్యాంగ నియమం కాదు. బహిరంగ విచారణ జరిపి రిజర్వేషన్ ఇవ్వడాన్ని వ్యతిరేకించే వాళ్ల అభిప్రాయాలు కూడ లెక్కలోకి తీసుకొని నిర్ణయం చేయాలన్నది అసలే కాదు. ఈ ఒక్క విషయంలోనే కాదు. ఏ విషయంలోనైనా సమస్యను వాస్తవికంగా గుర్తించాలి, హేతుబద్ధంగా పరిష్కరించాలి అన్నదే పాలనా నియమం. దీనికి సంబంధించిన ప్రాథమిక సమాచారం ప్రభుత్వం దగ్గర ఉండి, ప్రాథమికంగా హేతుబద్ధంగా వ్యవహరించినంతకాలం న్యాయస్థానాల జోక్యానికి అవకాశం లేదు, ఉండకూడదు. ఆపైన ప్రభుత్వ చర్యల తప్పొప్పులు ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజలు చూసుకుంటారు.

రిజర్వేషన్ల విషయంలో ఈ ప్రజాస్వామ్య సూత్రాన్ని న్యాయస్థానాలు పక్కన పెట్టి, వెనుకబడిన వర్గాల గుర్తింపు బహిరంగ విచారణ ద్వారా జరగాలనీ, శాస్త్రీయ ప్రమాణాలను సంతృప్తి పరచాలనీ, ఆ ప్రమాణాలను అందుకున్నదీ లేనిదీ తాము తేలుస్తామనీ అంటున్నాయి. 1992లో తొమ్మిది మంది జడ్జీలు ఇచ్చిన మండల్ కమిషన్ తీర్పు ఇంత దూరం పోలేదు గానీ దీనికి బీజం వేసింది. ఆ తరువాత వచ్చిన తీర్పులలో ఈ వైఖరి బలపడింది. మన రాష్ట్ర హైకోర్టు గతంలో ముస్లిం రిజర్వేషన్ల చట్టాన్ని కొట్టేస్తూ ఇచ్చిన తీర్పు దీనికి అతి సమీప ఉదాహరణ.

మొన్నటి సుప్రీంకోర్టు తీర్పులో ముగ్గురు జడ్జీలు విడిగా రాసిన అభిప్రాయంలో ఈ కోవకు చెందిన వ్యాఖ్యలూ సూత్రీకరణలూ చాలా ఉన్నట్టున్నాయి. న్యాయస్థానాలు మితిమీరి అధికారాన్ని చలాయిస్తున్న ఈ వైనాన్ని నిర్మొగమాటంగా చర్చించకపోతే ఒక్క రిజర్వేషన్ హక్కునేకాదు, మొత్తంగానే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం పోనుపోను చాలా కష్టం కాగలదు.